## పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన వసతులు

- రిటర్నింగ్ అధికారి రాంచందర్



మల్లాపూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌వో రాంచందర్

కోయిలకొండ, అక్టోబర్ 17: మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించనున్నట్లు రిటర్నింగ్ అధికారి రాంచందర్ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని పారుపల్లి, మనికొండ, ఖాజీపూర్, బూర్గుపల్లి, దమయపల్లి, కోయిలకొండ, సంగనోనిపల్లి, వింజమూరు తదితర గ్రామాల్లో పర్యటించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, ర్యాంప్‌లు, తాగునీటి వసతులు కల్పించి ఓటర్లు కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించ నున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ భరత్‌గౌడ్, ఎంపీడీవో జయరాం, డిప్యూటీ తాసీల్దార్ మురళి తదితరులు పాల్గొన్నారు.

## మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు



తాసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

నవాబ్‌పేట, అక్టోబర్ 17 : బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాసీల్దార్ మల్లికార్జునరావు పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బెల్టు షాపుల నిర్వాహకులను ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ బైండోవరైన తర్వాత కూడా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతి యుత వాతావరణం నెలకొనే విధంగా చర్యలు తీసుకోవాలని, ఈ సందర్భంగా బెల్టు షాపులు నిర్వహించే 15 మందిని బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై కరుణ, సిబ్బంది రెడ్యానాయక్, అంజి, బాలస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం పట్టివేత

కోస్గి, అక్టోబర్ 17 : అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. కోస్గి ఎస్సై శ్రీనివాసులు కథనం మేరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున్న పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారని అందులో భాగంగా కోస్గి మండలంలోని మీర్జాపూర్ గ్రామంలో మంగళవారం దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన మురళి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.15,724 విలువగల మద్యాన్ని పటుకొని సీజ్ చేసి నట్లు తెలిపారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

ధన్వాడ, అక్టోబర్ 17: మండలంలోని కొండాపూర్ గురుకుల పాఠశాలకు చెందిన ఇంటర్ విద్యార్థి సందీప్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజారాం మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి19 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే అండర్ 19 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు నుంచి సందీప్ ఆడనున్నట్లు తెలిపారు. సందీప్ ఎంపికపై వైస్ ప్రిన్సిపాల్ సురేశ్‌రావు, నాగమణి, కోచ్ రామ్మోహన్ గౌడ్, పీఈటీ సుగుణాకర్ , సంతోశ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## సర్పంచ్‌కు సన్మానం

బాలానగర్, అక్టోబర్ 17 : మండలంలోని ఉటుకుంటతండా సర్పంచ్ లలితకు ఇటీవల ఢిల్లీలో ఉత్తమ అవార్డు అందుకున్న సందర్భంగా మంగళవారం తండావాసులు, బీఆర్‌ఎస్ నాయకులు సర్పంచ్‌కు శాలువాతో సన్మానించి, బొక్కె అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ మంజూనాయక్, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు పురందాస్‌నాయక్, నాయకులు దాసునాయక్, శ్రీనునాయక్, బీక్యానాయక్, తండావాసులు పాల్గొన్నారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష, ఎస్పీ యోగేష్‌గౌతమ్
- సమస్యాత్మక కేంద్రాల పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, ఎస్పీ యోగేష్‌గౌతమ్

ఊట్కూర్, అక్టోబర్ 17 : అధికారులు అప్రమత్తంగా ఉండి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నారాయణపేట ఎస్పీ శ్రీహర్ష, ఎస్పీ యోగేష్‌గౌతమ్ స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని ఊట్కూర్, చిన్నపొర్ల, పెద్దపొర్ల, పులిమామిడి, బిజ్వారం, కొత్తపల్లి గ్రామాలను కలెక్టర్, ఎస్పీ సందర్శించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాట్లను పరిశీలించారు. సమస్యాత్మక గ్రామాల్లో ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రెవెన్యూ, పోలీస్ అధికారులకు వివరించారు. ఎన్నికల కమీషన్ ఆదేశానుసారంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అన్ని సౌకర్యాలను కల్పిస్తామని తెలిపారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, డీ ఎస్పీ సత్యనారాయణ, సీఐలు రామ్‌లాల్, శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సై గోకారి, తాసీల్దార్ శివశ్రీనివాస్, ఎంపీడీవో రమేశ్‌కుమార్, సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, డీటీ షమీమ్ సుల్తానా, ఆర్‌ఐలు రాఘవేంద్రారెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

### ఏర్పాట్లు పూర్తి చేయాలి

నారాయణపేట టౌన్, అక్టోబర్ 17: పట్టణ శివారులోని దత్త బృందావన్ కళాశాలలో ఓట్ల లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీహర్ష, ఎస్పీ యోగేష్ గౌతమ్అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణ శివారులోని దత్త బృందావన్ కళాశాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాల వద్ద బారికెడ్లు, పోలీస్ భద్రత ఏర్పాటు చేయాలన్నారు. మరమత్తులు ఉంటే త్వరగా పూర్తి చేయాలన్నారు. అదనపు కలెక్టర్లు, డీఎస్పీ సత్యనారాయణ ఉన్నారు.

# గాయత్రీ దేవిగా అమ్మవారు

మరికల్, అక్టోబర్ 17: మండలంలో నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని వాసవీ మాత దేవాలయం వద్ద ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో, కాళికదేవి ఆలయం వద్ద విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో, పాత కుర్వగేరి శివాలయం వద్ద వీరశైవ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో, తీలేరు, జిన్నారం, ఎలిగండ్ల గ్రామాల్లో నెలకొల్పిన అమ్మవారి విగ్రాహలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గాయిత్రీ దేవి అలంకరణలో అమ్మవారు

### దామరగిద్దలో...

దామరగిద్ద, అక్టోబర్ 17: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బతుకమ్మ ఆడారు. అంబాభవాని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలోబాలమణి, కోస్గి విజయలక్ష్మీ, తాళంపల్లి పల్లవి, సరోజ, జ్ఞానంధిని తదితరులు పాల్గొన్నారు.

### కోయిలకొండలో...

కోయిలకొండ, అక్టోబర్ 17: మండలంలో నవరాత్రి ఉత్సవాలను వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృత అభిషేకం , కుంకుమార్చన చేశారు. మండలంలోని అంకిళ్ల, అభంగపట్నం, శేరివెంకటాపూర్, వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం కార్యక్రమాలను నిర్వహించారు. వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరింపూజలు చేశారు.



వాసవీమాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

## గండీడ్ సింగిల్‌విండో చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

మహ్మదాబాద్, అక్టోబర్ 17 : గండీడ్ సింగిల్ విండో చైర్మన్ కమతం శ్రీనివాస్‌రెడ్డిపై డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం అందించారు. శ్రీనివాస్‌రెడ్డిని చైర్మన్ నుంచి తొలగించాలని సింగిల్‌విండో డైరెక్టర్లు లక్ష్మీనారాయణ, సత్యనారాయణరెడ్డి, రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకట్, చంద్రయ్య, ఆశోక్, దామ్లానాయక్, నర్సమ్మలను జిల్లా డీసీవోకు అవిశ్వాస తీర్మానాన్ని సంతకాలతో అందించారు.

## బాధితుడికి ఎమ్మెల్యే భరోసా

మరికల్, అక్టోబర్ 17 :నారాయణ పేట నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన మోటర్ సైకిల్ ర్యాలీలో ప్రమాదానికి గురైన బీఆర్‌ఎస్ మరికల్ పట్టణ అధ్యక్షుడు సురిటి చంద్రశేఖర్‌ను పార్టీ నాయకులు జిల్లా కేంద్రంలోని నవోదయ దవాఖానకు తరలించారు. చేతికి గాయాలుకాగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి దవాఖాన వైద్యులకు ఫోన్ చేసి చంద్రశేఖర్‌కు అవసరమైన వైద్యం అందించాలని సూచించారు. కార్యకర్తకు ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే భరోసా కల్పించిన ఎమ్మెల్యేకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

## మద్యం తాగి వ్యక్తి మృతి

నవాబ్‌పేట, అక్టోబర్ 17 : మండలంలోని పుట్టోనిపల్లితండాలో నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రానికి చెందిన కడెం శ్రీను(30) స్థాయికి మించి మద్యం తాగి మృతి చెందినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. ఎస్సై కథనం మేరకు దామరగిద్దకు చెందిన శ్రీను 15 రోజుల కిందట వారి ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. కాగా సోమవారం రాత్రి పుట్టోనిపల్లితండా ప్రాంతంలో బాగా మద్యం తాగి కింద పడి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు వివరించారు. భార్య అలివేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

## ఇసుక టిప్పర్ పట్టివేత

నవాబ్‌పేట, అక్టోబర్ 17 : మండలంలోని తీగలపల్లిలో సోమవారం అర్ధరాత్రి అక్రమ ఇసుక టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. ఎస్సై కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి ఫరూక్‌నగర్ మండలం చటాన్‌పల్లి గ్రామ పంచాయతీ మదిర జీడివాడ్యతండాకు చెందిన వడ్డె చిన్న రాములుకు చెందిన టిప్పర్ అక్రమంగా ఇసుక లోడ్‌తో తీగలపల్లి గ్రామానికి రావడంతో..రాత్రి గస్తీ తిరుగుతున్న పోలీస్ సిబ్బంది టిప్పర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. టిప్పర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

## ఎన్నికల నిబంధనలను పాటించాలి

బాలానగర్, అక్టోబర్ 17 : ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్సై శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలో పోలీస్ సిబ్బందితో కలిసి మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ.లక్షాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాల్లో 50 మద్యం బాటిల్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేశామని తెలిపారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.